భార్యతో సెల్ఫీనే పట్టించింది!

- మావోయిస్టు అగ్రనేత చలపతిని గుర్తించడంలో కీలకంగా స్మార్ట్‌ఫోన్
- సీనియర్ అధికారి వెల్లడి
- పదహారుకు చేరిన ఎన్‌కౌంటర్ మృతులు

న్యూఢిల్లీ, జనవరి 22: దశాబ్దాల పాటు భద్రతా దళాలకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న మావోయిస్టు అగ్ర నేత జయరాం రెడ్డి అలియాస్ చలపతి ప్రాణం పోవడానికి తన భార్య అరుణ అలియాస్ చైతన్య వెంకట్ రవితో తీసుకున్న సెల్ఫీ కారణమని తెలుస్తున్నది. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో మంగళవారం కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో చనిపోయిన 16 మంది మావోయిస్టులలో చలపతి ఒకరు. ఆయనపై కోటి రూపాయల రివార్డు ఉంది. ఒడిశాలోని నయాగఢ్ జిల్లాలో 2008 ఫిబ్రవరిలో 13 మంది భద్రతా సిబ్బందిని బలిగొన్న దాడికి చలపతే ప్రధాన సూత్రధారి. పోలీసుల ఆయుధాగారాన్ని దోచుకుని నయాగఢ్ నుంచి మావోయిస్టులు తప్పించుకు పారిపోవడం వెనుక చలపతి హస్తం ఉంది. ఆయుధాగారంపై దాడి జరిగిన సమయంలో పోలీసు బలగాలు నయాగఢ్ లోకి ప్రవేశించకుండా భారీ చెట్టు కొమ్మలను రోడ్డుకు అడ్డంగా పడేసి నయాగఢ్ లోకి వెళ్లే మార్గాలన్నిటినీ అడ్డుకోవడం చలపతి వ్యూహమేనని ఒక అధికారి చెప్పారు. అనేక దశాబ్దాలు అజ్ఞాత జీవితాన్ని గడిపిన చలపతిని గుర్తించడంలో అతని భార్య, ఆంధ్రా ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ డిప్యూటీ నాయకురాలు అరుణతో తీసుకున్న సెల్ఫీ సాయపడిందని ఆ అధికారి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత 2016 మేలో అక్కడ దొరికిన ఓ స్మార్ట్‌ఫోన్‌లో ఈ సెల్ఫీ లభించిందని ఆయన తెలిపారు. ఆ తర్వాత చలపతిపై రూ.కోటి రివార్డును ప్రభుత్వం ప్రకటించిందని, దీంతో అతను 8-10 మంది అంగ రక్షకులతో కూడిన భద్రతా దళాన్ని ఏర్పాటు చేసుకుని తిరగడం మొదలైందని ఆ అధికారి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు వాస్తవ్యుడైన చలపతి కేంద్ర కమిటీలో సీనియర్ సభ్యుడు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన చలపతి ఆ ప్రాంతంలో తరచు ఎన్‌కౌంటర్లు జరుగుతుండడంతో సురక్షితంగా ఉండేందుకు ఒడిశా సరిహద్దు సమీపంలోకి మకాం మార్చాడు. సైనిక ఎత్తుగడలు, గెరిల్లా పోరాటంలో చలపతిని నిపుణుడిగా భావిస్తారని అధికారులు చెప్పారు. 2026 నాటికి దేశం నుంచి మావోయిస్టులను నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేసిన అమిత్ షా నిన్నటి ఎన్‌కౌంటర్‌ను మావోయిస్టులకు మరో చావుదెబ్బగా అభివర్ణించారు.ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరి నక్సల్స్ మృతదేహాలను స్వాధీనం చేసుకోవడంతో మృతుల సంఖ్య 16కు చేరింది.

మావోయిస్టుల శిక్షణ శిబిరం స్వాధీనం

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 22 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులకు సంబంధించిన అత్యంత కీలకమైన శిక్షణ శిబిరాన్ని గుర్తించిన జవాన్లు దానిని స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు బీజాపూర్ జిల్లా పరిధిలోని బట్టిగూడ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న శిక్షణ శిబిరాన్ని జవాన్లు గుర్తించారు. మావోయిస్టులు వేలాది మందిని రిక్రూట్ చేసుకుని ఇక్కడే శిక్షణ ఇచ్చినట్లు తెలుస్తున్నది. అదే ప్రాంతంలో మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ స్మారక స్తూపాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా జరుగుతున్న ఆపరేషన్ 'కగార్'తో మావోయిస్టు పార్టీకి చిక్కులు వచ్చి పడుతున్నాయి. వేలాదిగా భద్రతా బలగాలు దండకారణ్యాన్ని చుట్టుముట్టి పార్టీ అగ్రనేతలను హతమారుస్తున్నాయి. బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధి ముత్వెండి-పీడియా వెళ్లే మార్గంలో జవాన్లను లక్ష్యంగా చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరను భద్రతా దళాలు మంగళవారం సాయంత్రం గుర్తించి నిర్వీర్యం చేశాయి.

జన్మతః పౌరసత్వం రద్దుపై న్యాయపోరు

- ట్రంప్ నిర్ణయంపై అమెరికాలోని 22 రాష్ట్రాల దావా
- రాజ్యాంగ సవరణ చేస్తేనే అమలు సాధ్యం: నిపుణులు
- అక్రమ వలసదారులపై ట్రంప్ మరిన్ని కఠిన ఆదేశాలు
- స్కూళ్లు, చర్చ్‌లలో ఉన్నా అరెస్టు చేయొచ్చని ఉత్తర్వులు

వైట్‌హౌజ్‌లోని రూజ్‌వెల్ట్ రూమ్‌లో ప్రసంగిస్తున్న ట్రంప్

వాషింగ్టన్, జనవరి 22: అమెరికాలో జన్మించే పిల్లలకు జన్మతః వచ్చే పౌరసత్వాన్ని రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను సవాల్ చేస్తూ కోర్టుల్లో నాలుగు దావాలు దాఖలయ్యాయి. డెమాక్రటిక్ పార్టీ ఎక్కువ స్థానాలు గెలిచిన 22 రాష్ట్రాలతో పాటు కొలంబియా జిల్లా, శాన్ ఫ్రాన్సిస్కో నగరం ట్రంప్ నిర్ణయాన్ని బోస్టన్, సియాటిల్ కోర్టుల్లో సవాల్ చేశాయి. ట్రంప్ తన అధికార పరిధిని దాటారని, అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని దావాల్లో పేర్కొన్నాయి. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్‌తో పాటు పలు వలసదారుల సంఘాలు సైతం ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌కు వ్యతిరేకంగా కోర్టులను ఆశ్రయించాయి. ట్రంప్ నిర్ణయం అమలైతే అమెరికాలో ఏటా 1.50 లక్షల మంది పిల్లలకు పౌరసత్వాన్ని తిరస్కరించాల్సి వస్తుందని మసాచుసెట్స్ అటార్నీ జనరల్ అండ్రియా జాయ్ క్యాంప్‌బెల్ తెలిపారు. రాజ్యాంగ హక్కులను లాక్కునే అధికారం ట్రంప్‌నకు లేదని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాజ్యాంగ సవరణతోనే సాధ్యమా?

ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌తో జన్మతః పౌరసత్వం రద్దు కుదరదని పలువురు న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'ట్రంప్ చాలామంది ప్రజలను అసంతృప్తికి గురిచేసే చర్యకు దిగుతున్నారు. అంతిమంగా ఈ విషయాన్ని కోర్టులు నిర్ణయిస్తాయి. ట్రంప్ సొంతంగా తీసుకునే నిర్ణయం కాదిది' అని అమెరికా రాజ్యాంగ నిపుణుడు, యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా లా స్కూల్ ప్రొఫెసర్ సాయికృష్ణ ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఉత్తర్వులను పాటించి అధికారులు పౌరసత్వాన్ని తిరస్కరిస్తే, వారు కోర్టును ఆశ్రయించవచ్చని, చివరకు సుప్రీంకోర్టు వరకు ఈ విషయం వెళ్లొచ్చని పలువురు నిపుణులు చెప్తున్నారు. జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని, ఇందుకు ప్రతినిధుల సభ, సెనేట్‌లో మూడింట రెండొంతుల సభ్యుల ఆమోదం, నాలుగింట మూడో వంతు రాష్ట్రాల ఆమోదం అవసరమని చెప్తున్నారు. ప్రస్తుతం రిపబ్లికన్ పార్టీకి ఉభయ సభల్లో ఉన్న మెజారిటీతో ఇది సాధ్యం కాదని అభిప్రాయపడుతున్నారు.

వ్యతిరేకిస్తున్న భారత-అమెరికన్ చట్టసభ్యులు

జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఇచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వును అమెరికాలోని భారత సంతతి చట్టసభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయం కేవలం అక్రమ వలసదారులపైనే కాకుండా భారత్ నుంచి హెచ్1బీ వీసాలపై వచ్చిన విద్యార్థులు, నిపుణులపైనా ప్రభావం చూపుతుందని ఇండియన్-అమెరికన్ చట్టసభ్యుడు రో ఖన్నా పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ ఏం చెప్పారనేది, ఏం చేశారనేది విషయం కాదని, జన్మతః పౌరసత్వం కొనసాగుతుందని, ఇందుకోసం తాను పోరాడతానని మరో సభ్యుడు శ్రీ ఠానేదార్ పేర్కొన్నారు. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, ఒక్క పెన్నుపోటుతో తీసుకోవాల్సినది కాదని మరో సభ్యురాలు ప్రమీలా జయపాల్ ఆరోపించారు.

పాఠశాలల్లో ఉన్నా అరెస్టు చేయొచ్చు

అక్రమ వలసదారులపై ట్రంప్ మరో కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకు పాఠశాలలు, చర్చ్‌లు వంటి సున్నితమైన ప్రదేశాల్లో అక్రమ వలసదారులను అరెస్టు చేయడానికి అవకాశం ఉండేది కాదు. ఈ ఆంక్షలను ట్రంప్ యంత్రాంగం తొలగించింది. ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేసే అధికారులు ఎక్కడైనా చర్యలు తీసుకోవచ్చని, ఇక నుంచి నేరస్థులు అరెస్టును తప్పించుకునేందుకు పాఠశాలలు, చర్చ్‌లలో దాక్కోలేరని మంగళవారం అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. ఈ నిర్ణయంతో అక్రమ వలసదారులు వారి పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు కూడా భయపడుతున్నారు.

చైనాపై 10 శాతం సుంకం?

ఫిబ్రవరి 1 నుంచి చైనా నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే వస్తువులపై 10 శాతం సుంకం విధించాలని భావిస్తున్నట్టు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కాగా, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఉద్దేశించి ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని ముగించేందుకు తాను పుతిన్‌ను కలవడానికి సిద్ధంగా ఉన్నానని, చర్చలకు పుతిన్ ముందుకు రాకపోతే రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించవచ్చని ట్రంప్ హెచ్చరించారు.

సమర్థులు అమెరికా రావడం ఇష్టమే: ట్రంప్

ఇతర దేశాలకు చెందిన నిపుణులు అమెరికాలో ఉద్యోగం చేసేందుకు వీలు కల్పించే హెచ్1బీ వీసాపై జరుగుతున్న చర్చలో రెండు వైపులా వాదనలు నచ్చాయని ట్రంప్ ప్రకటించారు. సమర్థులైన వారు తమ దేశానికి రావడం తనకూ ఇష్టమేనని చెప్పారు. ఒరాకిల్, సాఫ్ట్‌బ్యాంక్, ఓపెన్‌ఏఐ సంస్థల అధినేతలతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కృత్రిమ మేధ(ఏఐ)ను ప్రోత్సహించేందుకు ఒరాకిల్, సాఫ్ట్‌బ్యాంక్, ఓపెన్‌ఏఐ సంస్థల భాగస్వామ్యంతో ఒక కొత్త సంస్థను స్థాపించి, దాని ద్వారా 500 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు.

అమెరికాలో మంచు తుఫాన్ బీభత్సం

నలుగురు మృతి.. 2,200 విమాన సర్వీసులు రద్దు

న్యూ ఓర్లియాన్స్‌లో భారీగా కురుస్తున్న మంచు

వాషింగ్టన్, జనవరి 22: మంచు తుఫాన్‌లు టెక్సాస్ నుంచి న్యూయార్క్ వరకు 'గల్ఫ్ కోస్ట్'గా పేర్కొనే ప్రాంతాన్ని గజగజ వణికిస్తున్నాయి. భారీగా కురుస్తున్న మంచు.. ఎముకలు కొరికే చలి అమెరికా దక్షిణ రాష్ట్రాలను చుట్టుముట్టాయి. ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా వ్యాప్తంగా 2,200కుపైగా విమాన సర్వీసులను రద్దు చేశారని, 3 వేలకుపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని అధికారులు వెల్లడించారు. లూసియానా, టెక్సాస్ రాష్ట్రాల్లో విమానాశ్రయాలు, జాతీయ రహదారుల్ని మూసేశారు. మంగళవారం న్యూయార్క్ నగరంలో పలు చోట్ల 18 అంగుళాల మేర మంచు పేరుకుపోయింది. దీంతో పలు కౌంటీల్లో న్యూయార్క్ గవర్నర్ ఎమర్జెన్సీ విధించారు. న్యూ ఓర్లియాన్స్, ఫ్లోరిడా పెన్సాకోలాలో రికార్డ్‌స్థాయిలో 6.5 అంగుళాల మేర మంచు కురిసింది. కెనడాలో కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు మైనస్ 50 డిగ్రీలకు పడిపోయాయి.

సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

- ఫిబ్రవరి 11 వరకు దరఖాస్తులు
- మే 25న ప్రిలిమినరీ పరీక్ష

న్యూఢిల్లీ, జనవరి 22: సివిల్ సర్వీసెస్ పరీక్ష(సీఎస్ఈ) 2025కు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్ష కోసం రిజిస్ట్రేషన్లను సైతం ప్రారంభించింది. దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 11 వరకు అవకాశం ఇచ్చింది. మే 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించనున్నది. రెండు పేపర్లతో, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. ఈ ఏడాది సివిల్ సర్వీసుల్లో 979 పోస్టులను యూపీఎస్సీ భర్తీ చేయనున్నది. కాగా, ప్రతియేటా ఫిబ్రవరిలో సివిల్స్ పరీక్షకు యూపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసేది. ఈ ఏడాది జనవరిలోనే నోటిఫికేషన్ విడుదల చేసి, ప్రక్రియను ప్రారంభించింది.

కొత్తగా 100 సైనిక్ స్కూళ్లు

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

అలప్పుజ: దేశంలో ప్రాథమిక విద్య నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం చెప్పారు. ఈ కృషిలో భాగంగా దేశవ్యాప్తంగా కొత్తగా 100 సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యాధిరాజ సైనిక్ స్కూల్ 47వ వార్షికోత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రం సైనిక్ స్కూళ్లలో బాలికల ప్రవేశాలకు మార్గం సుగమం చేసిందన్నారు. అన్ని జిల్లాలకు సైనిక్ స్కూళ్లను విస్తరించాలని నిర్ణయించిందన్నారు. అన్ని ప్రాంతాలు, వేర్వేరు సాంస్కృతిక నేపథ్యాలు గల వారిని ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

కోటాలో మరో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య

ఈ నెలలో ఇప్పటివరకు ఆరుగురు బలవన్మరణం

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట పడటం లేదు. బుధవారం మరో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అహ్మదాబాద్‌కు చెందిన అఫ్షా షేక్ అనే యువతి జవహర్ నగర్‌లో సూసైడ్ చేసుకుంది. నీట్ శిక్షణ కోసం వచ్చిన ఆమె హాస్టల్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయింది. ఇది జరిగిన కొద్ది గంటల్లోనే మరో ఘటన చోటు చేసుకుంది. అసోం నాగోన్‌కు చెందిన పరాగ్ అనే విద్యార్థి మహావీర్ నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ నెలలో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థుల సంఖ్య ఆరుకు చేరుకుంది.

ఆర్జీ కర్ దోషికి ఉరిశిక్ష విధించండి

హైకోర్టును ఆశ్రయించిన సీబీఐ

కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల, దవాఖాన ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కి మరణ శిక్ష విధించాలని సీబీఐ కోరింది. రాయ్‌కి యావజ్జీవ ఖైదు విధిస్తూ సియాల్దా కోర్టు ఇచ్చిన తీర్పుపై కలకత్తా హైకోర్టులో అప్పీలు చేసింది. దోషికి మరణ శిక్ష విధించాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని హైకోర్టుకు తెలిపింది. తాను లేదా కేంద్ర ప్రభుత్వం మాత్రమే దీనిపై అప్పీలు చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పింది. ఈ కేసులో సీబీఐ దర్యాప్తుపై సీఎం మమత బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

చిక్కుల్లో సైఫ్ వేల కోట్ల ఆస్తులు

ప్రభుత్వ పరం కానున్న భోపాల్‌లోని ఆస్తులు?

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ప్రధానంగా భోపాల్‌లో ఉన్న బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ పటౌడీ కుటుంబానికి చెందిన రూ.15,000 కోట్ల విలువైన పూర్వీకుల ఆస్తులు కేంద్ర ప్రభుత్వం హస్తగతం కానున్నాయి. ఈ ఆస్తులపై ఉన్న స్టే ఉత్తర్వులను మధ్యప్రదేశ్ హైకోర్టు తొలగించడంతో 1968 నాటి ఎనిమీ ప్రాపర్టీ యాక్ట్ కింద ఈ ఆస్తులను కేంద్రం స్వాధీనం చేసుకునే అవకాశం ఏర్పడింది. ఈ చట్టం కింద 1947లో దేశ విభజన తర్వాత పాకిస్థాన్‌కు వలస వెళ్లిన వారి ఆస్తులను కేంద్ర ప్రభుత్వం సొంతం చేసుకోగలదు. 1947లో భోపాల్ నవాబుల పాలనలో ఉంది. సైఫ్ తండ్రి మన్సూర్ అలీ ఖాన్ తాత(తల్లి తరపు) నవాబ్ హమీదుల్లా ఖాన్ చివరి నవాబుగా ఉన్నారు.

పట్టాలపై వెంటాడిన మృత్యువు

- మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో ఘోర రైలు ప్రమాదం
- పుష్పక్ ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో నిప్పు రవ్వలు
- భయంతో పక్క ట్రాక్‌పై దూకిన పలువురు ప్రయాణికులు
- అదే ట్రాక్‌పై దూసుకొచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్
- రైలు ఢీకొని 12 మంది మృతి.. ఏడుగురికి గాయాలు

రైల్వే ట్రాక్ వద్ద పడివున్న ప్రయాణికుడి మృతదేహం

జల్‌గావ్, జనవరి 22: మహారాష్ట్రలోని జల్‌గావ్ సమీపంలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఒక రైలులో అగ్నిప్రమాదం నుంచి బయటపడేందుకు ప్రయత్నించిన ప్రయాణికులను మరో రైలు ఢీకొట్టింది. సెంట్రల్ రైల్వే, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్నో నుంచి ముంబై వెళ్తున్న పుష్పక్ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీల్లో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. నిప్పు రవ్వలు పుట్టి కోచ్‌లలో పొగ వ్యాపించింది. దీంతో మహేజీ - పర్ధాడే స్టేషన్ల మధ్య పచోరా సమీపంలో ప్రయాణికులు చెయిన్ లాగి రైలును ఆపారు. మంటలు వ్యాపిస్తాయనే భయంతో రైలు నుంచి పక్క ట్రాక్‌పైకి దూకారు. ఇంతలో అదే ట్రాక్ పైన బెంగళూరు నుంచి ఢిల్లీ వెళ్తున్న కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకొచ్చింది. ట్రాక్‌పైన ఉన్న ప్రయాణికులను ఈ రైలు ఢీకొట్టడంతో పెను ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడికక్కడే 12 మంది మృత్యువాత పడ్డారు. ఛిద్రమైన మృతదేహాలు, తెగిపడిన అవయవాలతో ఘటనాస్థలి భీతావహంగా మారింది.

12 మంది మృతి.. ఏడుగురికి గాయాలు

ప్రమాదంలో 12 మంది మరణించగా, ఏడుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గాయపడ్డవారిని పచోరాలోని ఓ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నామని, వీరికి ప్రాణాపాయం తప్పిందని మహారాష్ట్ర మంత్రి గిరిశ్ మహజన్ తెలిపారు. కాగా, గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. తమకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం పుష్పక్ ఎక్స్‌ప్రెస్‌లో నిప్పు రవ్వలు కనిపించాయని, పొగ వ్యాపించిందని ఓ రైల్వే అధికారి తెలిపారు. హాట్ ఆక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్ వల్ల ఇలా జరగొచ్చని తెలిపారు.

మరో ఐదేండ్లు జాతీయ ఆరోగ్య మిషన్ కొనసాగించాలని కేంద్రమంత్రివర్గం నిర్ణయం

జనపనారకు మద్దతు ధర రూ.5,650కు పెంపు

న్యూఢిల్లీ, జనవరి 22: జాతీయ ఆరోగ్య మిషన్‌ను మరో ఐదేండ్ల పాటు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో జరిగిన ఆర్థిక వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మీడియాకు వెల్లడించారు. జాతీయ ఆరోగ్య మిషన్ పదేండ్లు పూర్తి చేసుకుందని, 2021-22 మధ్యకాలంలో 12 లక్షల మంది వైద్య సంరక్షణ కార్మికులు ఇందులో చేరారని ఆయన తెలిపారు. ఈ మిషన్ మరో ఐదేండ్లు కొనసాగనున్నట్టు చెప్పారు. జనపనారకు మద్దతు ధరను ఆరు శాతం పెంచాలని సైతం నిర్ణయించినట్టు తెలిపారు. 2025-26 మార్కెటింగ్ సీజన్‌కు గానూ జనపనార మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.315 పెంచి, రూ.5,650 ఇవ్వనున్నట్టు ప్రకటించారు.

యూజీసీ ముసాయిదా నిబంధనలపై ఎన్డీయేలో విభేదాలు

ప్రతిపాదనలను వ్యతిరేకిస్తున్న జేడీయూ

ఆచితూచి మాట్లాడిన టీడీపీ, ఎల్జేపీ(ఆర్‌వీ)

న్యూఢిల్లీ, జనవరి 22: రాష్ట్ర విశ్వ విద్యాలయాల్లో వైస్ చాన్స్‌లర్ల నియామకంలో గవర్నర్లకు అపరిమిత అధికారాలను కట్టబెడుతూ, రాష్ట్రాల అధికారాలకు కత్తెర వేస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చేసిన ప్రతిపాదనలపై విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ఎన్డీఏ భాగస్వామ్య పక్ష పార్టీలు సైతం అసంతృప్తిని తెలియజేశాయి. ఇది సమాఖ్య వాదానికి, రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిరంకుశంగా ఉందని ఆరోపించాయి. యూజీసీ ముసాయిదా నిబంధనలు-2025ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ దృష్టికి తేనున్నట్టు జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ చెప్పారు. ఈ పరిణామంపై ఎన్డీఏలో మరో కీలక మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీలో కూడా అసంతృప్తి ఉన్నట్టు తెలిసింది. అయితే దీనిపై ఆ పార్టీ ఆచితూచి స్పందించింది. తాము యూజీసీ ముసాయిదాను చూశామని, తమ అధి నాయకత్వం ప్రస్తుతం దావోస్‌లో ఉన్నందున దీనిపై ఎలాంటి చర్చ జరగలేదని అన్నారు. యూజీసీ తాజా ముసాయిదాలో ఏమైనా లోపాలు, అభ్యంతరాలు ఉన్నా, దానిని బహిరంగంగా ప్రకటించమని, దీనిని రాజకీయం చేసే ఉద్దేశం తమకు లేదని, సంబంధిత వ్యక్తులతోనే అంతర్గతంగా దీనిపై చర్చిస్తామని ఆ పార్టీ జాతీయ ప్రతినిధి దీపక్ రెడ్డి తెలిపారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని ఎన్డీఏ మరో భాగస్వామ్య పార్టీ ఎల్జేపీ (రామ్ విలాస్) ఉపాధ్యక్షుడు ఏకే బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ఇది విపక్షాలు అధికార పార్టీల హక్కులను హరించడమేనని కేరళ ప్రభుత్వం మండిపడింది. యూజీసీ కొత్త నిబంధనలను వెంటనే రద్దు చేయాలని మంగళవారం అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఉన్నత విద్యను తమ ఆధీనంలోకి తీసుకోవాలన్న సంఘ్ పరివార్ అజెండాలో భాగంగానే దీనిని ప్రవేశపెట్టినట్టు ఆరోపించింది. యూజీసీ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలంటూ ఈనెల ఆరంభంలోనే ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం తీర్మానం చేసింది.

ఈడీకి లక్ష జరిమానా

- చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు
- పౌరులపై వేధింపులు ఆపండి
- బాంబే హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

ముంబై, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)పై బాంబే హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, పౌరులను వేధించడం ఆపాల్సిన సమయం వచ్చిందన్న జస్టిస్ మిలింద్ జాదవ్.. ఈడీకి రూ.లక్ష జరిమానా విధించారు. మహారాష్ట్రకు చెందిన రాకేశ్‌జైన్ అనే స్థిరాస్తి వ్యాపారి తమ మధ్య ఒప్పందాన్ని ఉల్లంఘించి మోసం చేశారంటూ ఆస్తి కొనుగోలుదారు ముంబైలోని విలే పార్లే పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ దర్యాప్తును ప్రారంభించింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. తగిన ఆధారాల్లేకుండా ఈడీ మనీలాండరింగ్ పేరుతో విచారణ జరుపుతున్నట్లు తేల్చింది.

మహిళల కంటే పురుషుల ఎత్తు, బరువు వేగంగా వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 22: ప్రపంచవ్యాప్తంగా గత శతాబ్ద కాలంలో మహిళల కంటే పురుషులు రెండు రెట్లు వేగంగా ఎత్తు, బరువు పెరిగారని, ఇది మహిళలు, పురుషుల మధ్య భారీ వ్యత్యాసాలకు దారితీసిందని నూతన అధ్యయనం వెల్లడించింది. రోహాంప్టన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ లూయిస్ హాల్సే నేతృత్వంలోని పరిశోధకుల బృందం ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు బ్రిటన్ లాంటి పలు దేశాల రికార్డుల నుంచి సేకరించిన సమాచారాన్ని ఉపయోగించుకుని పురుషులు, మహిళల ఎత్తు, బరువులో వచ్చిన మార్పులను గమనించామని, ఆ వివరాలను మానవ అభివృద్ధి సూచీ (హెచ్‌డీఐ) కొలిచిన జీవన ప్రమాణాలతో పోల్చిచూశామని హాల్సే తెలిపారు.

ఐదుగురు హత్యాచార దోషులకు ఉరి శిక్ష

కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఐదుగురికి మరణ శిక్ష విధించింది. 16 సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసి, హత్య చేయడంతోపాటు ఆమె తండ్రిని, నాలుగేళ్ల బాలికను కూడా వీరు హత్య చేసినట్లు రుజువైంది. ఈ కేసులో మరో వ్యక్తికి జీవిత ఖైదు విధించింది. దోషులు అత్యంత అమానుషంగా, క్రూరంగా ఈ నేరాలకు పాల్పడ్డారని కోర్టు వ్యాఖ